సాక్షి వికారాబాద్

గురువారం । 10 । ఆగస్టు । 2023



'బస్తీబాట'తో ప్రజల చెంతకు

ప్రజా సమస్యల పరిష్కారానికే బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



చెంచుబంధు ప్రవేశపెట్టాలి

చెంచుల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఆదివాసీ చెంచు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు అన్నారు. 8లో▸



ధైర్యంగా ఫిర్యాదు చేయండి

బాలికలు, మహిళలకు షీ టీమ్ అండగా ఉంటుందని షీ టీమ్ తాండూరు ఇన్‌చార్జి శేఖర్ అన్నారు. 8లో▸



పెద్దేముల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట క్యూ కట్టిన ప్రజలు

'గృహలక్ష్మి'కి బారులు

జిల్లా పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో గృహలక్ష్మి పథకంలో సొంతింటికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు బారులు తీరారు. దరఖాస్తుల స్వీకరణ గురువారం ముగుస్తుండంతో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ సాయం రూ.3లక్షలు అందజేస్తుండడంతో దరఖాస్తుదారులు పోటీ పడుతున్నారు. ఇందుకు కావాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ ప్రతాలకోసం మీసేవ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. సమయానికి సర్వర్ సతాయిస్తుండడంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గడువు పెంచాలంటూ దరఖాస్తుదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా ప్రభుత్వం దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 25న లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయనుంది.

– సాక్షి నెట్‌వర్క్, వికారాబాద్



బయోమెట్రిక్‌తో ఓపీ తీసుకునేందుకు బారులు తీరిన రోగులు

'బయోమెట్రిక్' బాధలు

- ఆధార్, వేలిముద్రలతో ఓపీ
- నూతన విధానంతో ఇబ్బంది పడుతున్న రోగులు

తాండూరు: అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు నూతన విధానంతో యాతన పడుతున్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆస్పత్రులకు వచ్చే వారి వివరాలు.. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు బయోమెట్రిక్ విధానం అమలు చేస్తోంది. తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి ప్రతి రోజు వేయి మంది వరకు వివిధ సమస్యలతో వస్తుంటారు. నూతన విధానంలో బయోమెట్రిక్‌లో వివరాలు తీసుకున్న తర్వాతే ప్రిస్క్రిప్షన్ ఇస్తున్నారు. బుధవారం ఆస్పత్రికి పెద్ద ఎత్తున రావడంతో రిజిస్ట్రేషన్ కోసం మహిళలకు, పురుషులకు వేర్వేరుగా లైన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో రోగి రిజిస్ట్రేషన్‌కు ఐదు నిమిషాలకు పైగా సమయం తీసుకోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నూతన విధానంతో నరకయాతన పడుతున్నామంటూ రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వ వైద్యం దూరం చేసి ప్రైవేటు, కార్పొరేట్‌కు మేలు చేసేందుకే ఈ విధానం తీసుకువచ్చారంటూ మండిపడ్డారు.

న్యూస్‌రీల్

హాస్టల్ వసతి కల్పించండి

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్



జిల్లా అధికారి ఉపేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం మర్పల్లిలో హాస్టల్ వసతి కల్పించాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్పల్లి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల స్థాయి హాస్టల్ మంజూరు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇదే విషయమై బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను కలిసి విన్నవించినట్లు ఆయన వివరించారు.

పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



పర్వత్‌పల్లిలో రైతులకు సూచనలు చేస్తున్న గోపాల్

బషీరాబాద్: రైతులు సాగు చేసిన పంట వివరాలను ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఏఈఓలకు సూచించారు. బుధవారం బషీరా బాద్ మండలం పర్వత్‌పల్లి, మర్పల్లి గ్రామాల్లో పర్యటించి 15 సర్వే నంబర్లలో సాగు చేస్తున్న పంటల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల నమోదు గడువులోగా పూర్తి చేయాలన్నారు. రైతులు పత్తి, కంది, అంతర పంటల సాగులో యాజ మాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పంటల మధ్య నీళ్లు నిలువకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజ్‌కుమార్, పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

హక్కుల కోసం నిరంతర పోరాటం

టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్



పద్మనాభస్వామి ఆలయంలో టీఎన్జీఓ సంఘం సభ్యులు

వికారాబాద్ అర్బన్: నాన్ గెజిటెడ్ ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ అన్నారు. బుధవారం ఆయన టీఎన్జీఓ జిల్లా నాయకులతో కలిసి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉద్యోగుల స్థితిగతులపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్, కార్యదర్శి అజ్మత్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింలు, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతగిరి: జిల్లా పోలీసు కార్యాలయంలోని పలు విభాగాలను ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలని.. ఫైల్స్ పెండింగ్‌లో ఉంచకూడదని సూచించారు. ప్రతీ సెక్షన్‌లోని పెండింగ్ ఫైల్స్ వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఓ జ్యోతిర్మయి, పలువురు పోలీసు అధికారులున్నారు.

ముహూర్తం ఖరారు

- రేపు మంత్రి చేతుల మీదుగా జేపీఎస్‌లు, వీఆర్‌ఏలకు నియామక పత్రాలు
- జేపీఎస్‌ల రెగ్యులరైజేషన్ కసరత్తు పూర్తి
- 625 మంది వీఆర్‌ఏలకు శాఖల కేటాయింపు
- కేటగిరీలు, శాఖల వారీగా జాబితా సిద్ధం



వికారాబాద్: వీఆర్‌ఏలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామక పత్రాలు అందించేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఇటీవల వారిని రెగ్యులరైజ్ చేసిన విషయం విదితమే. వారం రోజులుగా వీఆర్‌ఏలకు వారి విద్యార్హతను బట్టి నాలుగు కేటగిరీలుగా విభజించారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ కసరత్తు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం ఖాళీల ఆధారంగా ఆయా శాఖలకు కేటాయించారు. దీంతోపాటుగా తాజాగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను సైతం ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. వీరి నియామకానికి నాలుగేళ్ల సర్వీసు, పని మాపనంలో 70మార్కులు సాధించాలనే నిబంధన పెట్టింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఇప్పటికే వారి పనిని మాపనం చేసి మార్కులు కేటాయించింది. అర్హుల జాబితా సైతం సిద్ధమైంది. జిల్లాలో రెగ్యులరైజ్ అయిన జేపీఎస్‌లకు, వీఆర్‌ఏలకు నియమాక పత్రాలు అందించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. శుక్రవారం నిర్వహించే సమావేశంలో మంత్రి సబితారెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

309 జేపీఎస్‌లు నాలుగేళ్లు పూర్తి

నాలుగు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలంటే వారు నిర్వహించిన పనిలో కనీసం 70 మార్కులు సాధించాలనే షరతు విధించింది. ఇందుకు ప్రభుత్వం జిల్లాల వారిగా త్రిసభ్య కమిటీని వేసి ఎనిమిది పారామీటర్స్ ఆధారంగా వారి పనిని మాపనం చేశారు. ఇందులో 100 మార్కులకు 70 మార్కులు సాధించాలనే నిబంధన విధించారు. అయితే ఈ కసరత్తు పూర్తి చేసిన త్రిసభ్య కమిటీ అర్హత పొందిన వారి జాబితా సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 566 పంచాయతీలుండగా ఇందులో 420 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వీరిలో 309 మంది కార్యదర్శులు ఆగస్టుతో నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు. 420 మంది జేపీఎస్ పనితీరుపై జరిపిన త్రిసభ్య కమిటీ విచారణలో 15 నుంచి 20 మంది జేపీఎస్‌లకు 70 కంటే తక్కువ మార్కులు వచ్చాయని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం విధించిన షరతుల విషయంలో జేపీఎస్‌లు ఆందోళనకు గురవుతున్నారు. ఇతర శాఖల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే సమయంలో పని మాపన విధానం అమలు చేయని ప్రభుత్వం ఒక్క మా విషయంలోనే ఎందుకిలా వివక్ష చూపుతోందని ప్రశ్నిస్తున్నారు. అయితే త్రిసభ్య కమిటీలోనూ వారి పని విధానంపై అవగాహన లేని పోలీసు, ఫారెస్టు అధికారులను నియమించడాన్ని సైతం వారు తప్పుపడుతున్నారు.

186 మంది వీఆర్‌ఏలకు వీఆర్‌ఎస్

ప్రభుత్వం వీఆర్‌ఏలకు పే స్కేల్ ఇవ్వటంతో పాటు వారి విద్యార్హత ఆధారంగా క్యాడర్ ఫిక్స్ చేస్తూ ఆయా శాఖలకు కేటాయించాలని మార్గదర్శకాలు విడుదల చేస్తూ జీఓ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారులు కేటగిరీల వారిగా విభజిస్తూ కసరత్తు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 980 వీఆర్‌ఏ పోస్టులు ఉండగా ఇందులో 812 మంది వీఆర్‌ఏలు ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. జీఓ ప్రకారం 10వ తరగతి విద్యార్హత ఉన్న వారికి ఫోర్త్ క్లాస్ ఉద్యోగులుగా, ఇంటర్ విద్యార్హత గల వారిని రికార్డ్ అసిస్టెంట్లుగా, డిగ్రీ ఆపైన అర్హత ఉన్నవారిని జూనియర్ అసిస్టెంట్లుగా నియమించాలని నిర్ణయించింది. ఇక 60 ఏళ్లు నిండిన వారి స్థానంలో వారి వారసులకు ఉద్యోగం కల్పిస్తామని పేర్కొంది. జిల్లాలో 812 మంది వీఆర్‌ఏలలో 186 మంది 60 ఏళ్లు పైబడిన వారుండడంతో వీరికి వీఆర్‌ఎస్ ఇవ్వనున్నారు. మిగితా 625 మంది వీఆర్‌ఏలకు క్యాడర్ ఫిక్స్ చేయటంతో పాటు శాఖలు కేటాయించారు. ఇందులో అత్యధికంగా 142 మందిని రెవెన్యూ శాఖకు, 31 మందిని మున్సిపాలిటీలకు, 74 మందిని పంచాయతీరాజ్ విభాగానికి, ఏడుగురిని వ్యవసాయ శాఖకు కేటాయించారు. మిగిలిన వారిని నీటిపారుదల, మిషన్ భగీరథ తదితర శాఖలకు కేటాయించారు.

హత్యకేసులో నిందితురాలికి జీవిత ఖైదు

రూ.వెయ్యి జరిమానా

అనంతగిరి: హత్య కేసులో నిందితురాలికి జిల్లా సెషన్స్ కోర్టు జీవితఖైదుతో పాటుగా జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. ఎస్పీ కోటిరెడ్డి తెలిపిన ప్రకారం.. వికారాబాద్ పీఎస్ పరిధిలో 2013లో షేక్ గౌస్‌పాషా హత్య జరిగింది. మృతుడి భార్య హసీనాబేగం ఫిర్యాదు మేరకు కొత్తగడికి చెందిన ఏ–1 ముత్తారగాళ్ల మయూర్(చనిపోయాడు)చ ఏ–2 సంగీతపై అప్పటి ఎస్‌హెచ్‌ఓ లచ్చిరాం నాయక్ కేసు నమోదు చేశారు. చెవి కమ్మలు కుదువ పెట్టిన విషయంలో గొడవ చోటుచేసుకుని గౌస్‌పాషాను ఇటుకలతో కొట్టి చంపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి సుదర్శన్ బుధవారం సంగీతకు జీవితఖైదుతో పాటుగా రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని చెప్పారు.

రైల్లో వస్తారు.. బైకేసుకెళ్తారు





నిందితులు భాస్కర్ బోయిని శ్రీకాంత్ మెట్టు శ్రీకాంత్

- ముగ్గురు పాత నేరస్తులు అరెస్టు
- 27 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: వికారాబాద్ జిల్లా తాండూరు నుంచి హైదరాబాద్‌కు రైలులో వస్తారు. ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగిలించి, రూ.5–6 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఘరానా నిందితులను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.22.20 లక్షల విలువ చేసే 27 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను బుధవారం సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మీడియాకు వెల్లడించారు.

- వికారాబాద్ జిల్లా కమాల్‌పూర్‌నకు చెందిన బోయిని శ్రీకాంత్, మేతారి భాస్కర్, మెట్టు శ్రీకాంత్‌లు పాత నేరస్తులు. బైక్‌లు దొంగిలించి, సొమ్ము చేసుకోవటం వీరి స్టైల్. ఈ ముగ్గురు నిందితులపై ఇప్పటికే సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్లలో 15 కేసులున్నాయి. గతేడాది అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చినా వీరి ప్రవృత్తిలో మార్పు రాలేదు.
- తాండూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చి జన సంచారం తక్కువగా కాలనీలు, ప్రాంతాలను ఎంపిక చేసుకుంటారు. రెక్కీ నిర్వహించి అర్ధరాత్రి వేళలలో ఎంపిక చేసిన ప్రాంతానికి వెళతారు. నకిలీ తాళాలను ఉపయోగించి బైక్ లాక్‌ను ఓపెన్ చేసి, అక్కడి నుంచి ఉడాయిస్తారు. చోరీ చేసిన బైక్‌లను వికారాబాద్ జిల్లా శివారు ప్రాంతాలలో అమాయకులకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈక్రమంలో దర్యాప్తు ప్రారంభించిన బాలానగర్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), జీడిమెట్ల పోలీసులు బోయిని శ్రీకాంత్, భాస్కర్, మెట్టు శ్రీకాంత్‌లను అరెస్టు చేశారు.

మాట నిలుపుకొన్న కేసీఆర్

- రేషన్ డీలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- మంత్రి సబితారెడ్డి
- కమీషన్ పెంపుపై కృతజ్ఞతలు తెలిపిన రేషన్ డీలర్లు

మహేశ్వరం: రేషన్ సరుకులపై కమీషన్ పెంచి ఇచ్చిన మాట సీఎం కేసీఆర్ నిలుపుకున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. కమీషన్ పెంపుపై బుధవారం వారు మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. క్వింటాలుకు రూ. 70 ఉన్న కమీషన్‌ను రూ.140కి పెంచినట్లు తెలిపారు. హెల్త్ కార్డుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ గౌడ్, మండల అధ్యక్షుడు ఎంఏ సత్తార్, రేషన్ డీలర్లు శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్, కృష్ణ, శివ, వెంకటరమణారెడ్డి, వెంకటేష్, యాదయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి

తుక్కుగూడ: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తుక్కుగూడలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని 9,12,14వ వార్డులో సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,రజక,శాలివాహన సంఘాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 కోట్లు మంజూరు చేయడంపై మంత్రి.. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ బీ వెంకట్రామ్, డీఈఈ యాదయ్య, ఏఈఈ కే భార్గవ్‌రెడ్డి,కౌన్సిలర్లు హేమలత, భావన, లావణ్య, సుమన్, నాయకులు రాజు,శ్రీధర్, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి,నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

బడంగ్‌పేట్: కమీషన్ పెంపుపై నియోజకవర్గ రేషన్ డీలర్లు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం మంత్రి సబితారెడ్డి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.మా బతుకుల్లో జీవం నింపిన కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, బాలాపూర్ మండల అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, డీలర్లు గణేష్, కృష్ణగౌడ్, సురేష్‌గుప్తా, హర్షవర్ధన్, భాస్కర్ రెడ్డి, సత్తయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్లు

జలాశయాలు విలవిల!

జిల్లాలోని పలు జలాశయాలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. శిఖం భూములను ఆక్రమించి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు వెలిశాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు నిండి.. ఆక్రమణలు కళ్లకు కడుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని అధికార యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోందనే ఆరోపణలున్నాయి.



ఇబ్రహీంపట్నం: లక్ష్మీనగర్ కాలనీని ముంచేసి ఇళ్లలోకి చేరిన ఇబ్రహీంపట్నం చిన్నచెరువు నీరు

అన్యాక్రాంతమవుతున్న చెరువులు, కుంటలు

- శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో జోరుగా ఆక్రమణలు
- ఏటి కాల్వలను ఆక్రమించి వెలిసిన నిర్మాణాలు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు

ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం రూరల్: హైదరాబాద్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కబ్జాకు గురైంది. సుమారు 1,400 ఎకరాల్లో 50 ఫీట్ల లోతులో 0.8 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో విస్తరించి ఉన్న ఈ చెరువుకు 1,700 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులోకి వరద వచ్చే ఫిరంగి కాల్వ కబ్జాకు గురికావడం, అడ్డంగా కట్టడాలు వెలియడంతో వర్షపు నీటి పారుదలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో ఎప్పుడూ ఎండని చెరువు 1992లో చుక్క నీరు లేకుండా వట్టిపోయింది. ఆతర్వాత 2008లో కురిసిన భారీ వర్షాలతో మళ్లీ జల కళను సంతరించుకుంది. నగరానికి చేరువగా ఉండటం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడంతో.. ఇక్కడి చెరువులు, కాల్వలు, కుంటలకు చెందిన వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆదిబట్ల, కొంగరకలాన్, మంగళ్‌పల్లి, ఉప్పరిగూడ నుంచి 16 కిలోమీటర్ల మేర ఉన్న ఫిరంగి కాల్వ కబ్జాకు గురైంది. సహజ వనరులను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. హెచ్‌ఎండీఏ అధికారులు సైతం కాల్వపై దృష్టి సారించడం లేదు.దీంతో అక్రమార్కులు మట్టి, రాళ్లు నింపేస్తూ కాల్వ విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. బఫర్ జోన్ సైతం వదలడం లేదు. కాల్వ స్థలంలో ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఎంపీ పటేల్‌గూడ రెవెన్యూ పరిధిలోని ఓఆర్‌ఆర్ సమీపంలో నిర్మించిన అపార్ట్‌మెంట్లలోకి వర్షపు నీరు చేరింది. ఆక్రమణలను నివారించాల్సిన అధికారులు తాయిళాలకు అలవాటుపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

వెంచర్లు, ఇళ్లలోకి వరద

పెద్ద, చిన్న చెరువులు నిండటంతో శిఖం భూముల్లో వెలిసిన ఇళ్లు, ఫంక్షన్ హాల్‌తో పాటు పలు కట్టడాల్లోకి సైతం నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఈసారి సైతం కురిసిన ఏకధాటి వర్షాలతో ప్రస్తుతం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పెద్ద చెరువు బ్యాక్ వాటర్ లక్ష్మీనగర్ కాలనీలోని రెండు వరుసల ఇళ్లను ముంచేసింది.

కడ్తాల్‌లో..

కడ్తాల్: కడ్తాల్ రెవెన్యూ పరిధిలో సుమారు 15 చెరువులు, 190 కుంటలు ఉన్నాయి. వీటి శిఖం భూములను కొంతమంది ఆక్రమించారు. భూముల ధరలు భారీగా ఉండటంతో దేవరచెరువు, నాగిరెడ్డికుంట, గుర్లకుంట, ఉప్పరాసికుంట, చౌడమ్మచెరువు, పెద్దకుంట, కుమ్మరికుంట ఆక్రమణకు గురయ్యాయి. పగలు, రాత్రి తేడా లేకుండా చెరువులు, కుంటల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తులిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సర్వే చేయించి శిఖం భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

'చిన్న'బోతున్న చెరువులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని చెరువులు కుంచించుకుపోగా.. వెంచర్లు, కబ్జాలతో కుంటలను మాయం చేశారు. శిఖం భూముల్లో నిర్మించిన ఇళ్లు నీట మునగడంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు, పోచమ్మకుంట చెరువులు కొంతమేర కబ్జా కోరల్లో చిక్కుకోగా.. సుందరీకరణ పేరుతో చెరువుల విస్తీర్ణం మరింత తగ్గిపోయింది. బాలాపూర్ పెద్దచెరువు, వెంకటాపూర్ బురాన్‌ఖాన్ చెరువులు సైతం అన్యాక్రాంతానికి గురయ్యాయి.

క్లుప్తంగా

అనుమతులు లేకుండా బర్త్‌డే వేడుకలు, డీజే ర్యాలీ

- జనరేటర్ ట్రాలీ ఢీకొని బాలుడికి గాయాలు
- తాండూరు పీఎస్‌లో కేసు నమోదు

తాండూరు టౌన్: అనుమతి లేకుండా జన్మదిన వేడుకల ర్యాలీ నిర్వహించడంతోపాటు ఓ బాలుడు గాయాలపాలు కావడానికి కారకుడైన బీఆర్‌ఎస్ నాయకుడు అబ్రార్ లాలాపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళవారం రాత్రి అబ్రార్ లాలా జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక విలియం మూన్ చౌరస్తా నుంచి పాతతాండూరు వరకు డీజె సౌండ్ బాక్సులతో ర్యాలీగా వెళ్తుండగా, జనరేటర్ ట్రాలీ కింద రెహాన్ అనే బాలుడు పడి తీవ్రగాయాలపాలైన విషయం విదితమే. బాలుడు గాయాలు పాలు కావడం, ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించడంతో పాటు అనుమతి లేకుండా ర్యాలీ, డీజె ఏర్పాటు చేయడంపై పలు సెక్షన్ల కింద అబ్రార్ లాలా, జనరేటర్ యజమానిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వికోకుమార్ మృతదేహం

మోమిన్‌పేట: పురుగులమందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం చోటు చేసుకొంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ఇజ్రాచిట్టంపల్లి గ్రామానికి చెందిన బర్మావత్ వికోకుమార్(23) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు మర్పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి వికోకుమార్ మృతి చెందాడు. మద్యానికి బానిసై అనారోగ్యం కారణంగా పురుగులమందు సేవించినట్లు మృతుడి చిన్ననాన్న బర్మావత్ పరుశురాం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరన్‌కోట్‌లో లారీ మిస్సింగ్

పీఎస్‌లో కేసు నమోదు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్‌లో లారీ మిస్సింగ్ కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ మధుసూధన్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు పట్టణానికి చెందిన జహీర్ యొక్క లారీని కరన్‌కోట్ గ్రామానికి చెందిన కాశీం (డ్రైవర్) నడుపుతున్నాడు. కాశీం కొన్నిరోజులుగా లారీని గ్రామంలోని వివేకానంద విగ్రహం వద్ద ఉంచాడు. బుధవారం ఉదయం కాశీం లారీ ఉన్న ప్రదేశానికి వెళ్లి చూడగా అక్కడ లారీ కనిపించలేదు. కాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిత్రుడి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే ఆనంద్


రాంరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తన మిత్రుడి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ధారూరు మండల పరిధిలోని కొండాపూర్‌కలాన్ గ్రామానికి చెందిన జి.రాంరెడ్డి ఉన్నత పాఠశాలలో చదువుకునే రోజుల్లో ఎమ్మెల్యే ఆనంద్ మిత్రుడు. రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌కలాన్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే ఆనంద్ మిత్రుడు రాంరెడ్డి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పూలమాల వేసి నివాళులర్పించి పాడె మోసారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా పలికారు.

'బస్తీబాట'తో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

పరిగి: ప్రజా సమస్యల పరిష్కారానికే బస్తీబాట నిర్వహిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణం కేంద్రంలోని 13, 14వ వార్డుల్లో బస్తీబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదా అనేది తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ మంచి నీటి సరఫరా తదితర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్ రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మధుసూదన్, కౌన్సిలర్లు సమీనాబేగం, కృష్ణ, వెంకటేశ్, మునీర్, సానియా సుల్తానా, అన్వర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

పూడూరు: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి, బార్లపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అజీం, మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజేయులు, నాయకులు పాల్గొన్నారు.

జల్‌పల్లి అభివృద్ధికి రూ.25 కోట్లు

మంత్రి సబితా రెడ్డి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, నాయకులు

పహాడీషరీఫ్: ఖాళీ స్థలం ఉన్న పేదలు గృహలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసుకొని రూ.3 లక్షల లబ్ధి పొందాలని మంత్రి సబితారెడ్డి సూచించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని 2, 3 ,4, 5 వార్డుల్లో రూ.3.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రెండు రోజుల క్రితం రూ.25 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ఇప్పటికే 58, 59 జీఓల కింద ఉన్న ఇళ్లకు సంబంధించి రెగ్యులరైజ్ చేయడంతో ఎంతో మందికి మేలు కలిగిందని....తాజాగా నోటరీపై కూడా క్రమబద్ధీరిస్తుండడాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వసంత, కౌన్సిలర్లు అహ్మద్ కసాది, జింకల రాధిక శ్రవణ్, రహిమా యాహ్యా, జాఫర్ బామ్, కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, షేక్ అఫ్జల్, ఎక్బాల్, యంజాల జనార్దన్, లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, ఉస్మాన్ షరీఫ్, ఉమర్ బామ్, నగేష్, మేరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాల పంపిణీ..

మహేశ్వరం: నిరుపేదలకు అండగా ఉండే ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని మంత్రి సబితారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామంలో సర్వే నం–61లోని ప్రభుత్వ భూమిలో 300 మంది నిరుపేదలకు బుధవారం మంత్రి ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. నిరుపేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పెద్దదిక్కుగా ఉన్నారని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మహేశ్వరం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, నాయకులు పాల్గొన్నారు.

'చెంచుబంధు' ప్రవేశపెట్టాలి

ఆదివాసీ చెంచు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు


ఆదివాసీ జెండాను ఆవిష్కస్తున్న హన్మంతు

కుల్కచర్ల: చెంచుల అభ్యున్నతికి ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఆదివాసీ చెంచు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెంచు హన్మంతు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండల పరిధిలోని సాల్వీడు గ్రామంలో బుధవారం ఆదివాసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వెనుకబాటుకు గురౌతున్న చెంచు ప్రజల అభ్యున్నతికి చెంచుబంధు ప్రవేశపెట్టాలన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న ప్రభుత్వం కనుమరుగౌతున్న తమ చెంచుజాతిపై మాత్రం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెంచుల అభ్యున్నతికి మన్ననూరులో ఏర్పాటుచేసిన ఐటీడీఏ కార్యాలయాన్ని వికారాబాద్ జిల్లాకు తరలించాలన్నారు. లంబాడా ప్రజలతో కాకుండా ప్రత్యేకంగా ఆదివాసి చెంచుల ప్రజల అభ్యున్నతికి పథకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఎస్టీ కేటగిరిలో తక్కువ సంఖ్యలో ఉన్న తమకు సమన్యాయం జరగడంలేదన్నారు. ఆదివాసి చెంచు ప్రజలందరూ తమ పిల్లలకు చదువు చెప్పించి ఉద్యోగాలు సాధించేలా వారికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బాలయ్య, చెంచు సంఘం నాయకులు రాములు, హన్మంతు, శ్రీనివాస్, రాంరెడ్డిపల్లి శ్రీనివాస్, హన్మయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'ఖబరస్థాన్ జీఓ'ను రద్దు చేయాలి

కలెక్టర్, ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

తలకొండపల్లి: ఖానాపూర్ గ్రామ పంచాయతీ ప్రభుత్వ భూమిలో ఖబరస్థాన్ నిర్మాణానికి జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్‌తో కలిసి బుధవారం కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఎంపీటీసీ సరితాగణేశ్‌గుప్తా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిసి ఖబర్‌స్థాన్ నిర్మాణాన్ని ఆపాలని కోరారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఖానాపూర్ పంచాయతీ పరిధిలోని 256 సర్వే నంబర్‌లో 42 ఎకరాల్లో ఖబరస్థాన్ నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసిందన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. సదరు భూముల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు వంటివి నిర్మిస్తే అన్నివర్గాల వారికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. గతంలో ఈ స్థలాన్ని జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డు కోసం కేటాయించగా.. అప్పట్లో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్య, గణేశ్‌గుప్తా, మాజీ ఎంపీపీ శ్రీనివాస యాదవ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, సర్పంచ్‌లు లలితాజ్యోతయ్య, రమేష్, ఉప సర్పంచ్ అనిల్, రాజేందర్‌రెడ్డి, శశంకర్‌రెడ్డి, దశరథ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి


అవగాహన కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు, విద్యార్థులు

షీ టీమ్ తాండూరు ఇన్‌చార్జి శేఖర్

తాండూరు టౌన్: బాలికలు, మహిళలకు షీ టీమ్ అండగా ఉంటుందని షీ టీమ్ తాండూరు ఇన్‌చార్జి శేఖర్ అన్నారు. బుధవారం స్థానిక నేతాజీ గురుదేవ్ గురుకుల్ స్కూల్‌లో షీ టీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ కళాజాత బృంద సభ్యులు అశోక్, హన్మంతు, కానిస్టేబుల్ మమత పాల్గొన్నారు. ఈసందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థినులు పాఠశాల, కళాశాలలకు వెళ్లే సమయంలో, మహిళలు ఉద్యోగాలకు వెళ్లే సమయంలో లేదా ఇతర విషయాల్లో ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే 100 లేదా 181 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సైబర్ మోసాల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా పెడతామన్నారు. షీ టీమ్ సభ్యులు నిత్యం బస్టాండు, రైల్వేస్టేషన్, కళాశాలలు, పాఠశాలల వద్ద నిఘా ఉంచుతారన్నారు. పాఠశాల డైరెక్టర్ మణిమాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నాప్, హత్యాయత్నం కేసులో..

- ముగ్గురు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన వికారాబాద్ సీఐ శ్రీను

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన విషయంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వికారాబాద్ సీఐ శ్రీను తెలిపారు. వివరాలు.. అత్వెల్లి గ్రామానికి చెందిన నిందితుడైన మాధవరెడ్డి బాధితుడు బాలరాజుది ఒకే గ్రామం. సంవత్సరం క్రితం ఇరువురు కలిసి మేకల వ్యాపారం చేయగా బాగా వర్షాలు కురవడంతో మేకలు చనిపోయి నష్టం వచ్చింది. అనంతరం వారిద్దరూ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశారు. ఈ క్రమంలోనే మాధవరెడ్డి.. బాలరాజుకు కొన్ని డబ్బులు అప్పుగా ఇచ్చాడు. ఇచ్చిన అప్పు డబ్బులను తిరిగి ఇవ్వమంటే బాలరాజు ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వకుండా మార్కెట్లో మాధవరెడ్డి గురించి బాలరాజు చెడుగా చెప్పడంతో బాలరాజుపై మాధవరెడ్డి కక్ష పెంచుకున్నాడు. దీంతో బాలరాజును ఎలాగైనా చంపాలని అనుకున్నాడు. పథకం ప్రకారం మాధవరెడ్డి తన వద్ద సంవత్సర కాలం నుంచి కూలిపని చేస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన సునీల్, అనిల్‌కు ఈ విషయం చెప్పి వారితో మర్డర్ చేయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మాధవరెడ్డి తన కారులో నారాయణ స్కూల్ వద్ద బాలరాజు స్కూటీని అడ్డగించి కిడ్నాప్ చేసి కారులో అత్వెల్లి గ్రామ శివారికి తీసుకెళ్లారు. అక్కడ చిన్న రామయ్య వ్యవసాయ బావిలో బాలరాజు చేతులు కాళ్లు తాళ్లతో కట్టేసి మూతికి ప్లాస్టర్ వేసి ఒక సంచిలో వేసి మూటగట్టి బావిలో పడేశారు. అదే సమయంలో పోలీసు జీపు సైరన్ వినపడగా అక్కడి నుంచి వారంతా పరారయ్యారు. బాలరాజు ఎలాగోలా మూట విప్పుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం బాలరాజు ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీను తెలిపారు.

ఆస్తి పంపకాల్లో భార్యల ఒత్తిడి

మనస్తాపంతో భర్త ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొంరాస్‌పేట: ఆస్తి పంపకాల విషయంలో భర్త, అతడి ఇద్దరు భార్యల మధ్య తలెత్తిన తగాదాతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బొంరాస్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన శీలంగారి సురేశ్(53) మొదటిభార్య వాణికి కొడుకు, కూతురున్నారు. కుటుంబంలో జరిగిన గొడవల కారణంగా వాణి పిల్లలను తీసుకొని వెళ్లి 30 సంవత్సరాలుగా సురేష్‌కు దూరంగా ఉంటోంది. అనంతరం కొన్ని సంవత్సరాల తర్వాత సురేశ్ భాగ్యశ్రీని పెళ్లి చేసుకొని మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద ఉన్న తన పొలంలోని మామిడితోటలోని ఇంట్లో ఉంటున్నాడు. రెండో భార్య భాగ్యశ్రీకి కొడుకు ఉన్నాడు. ఈ క్రమంలో గత కొన్నేళ్లుగా భర్త సురేశ్‌కు అనారోగ్యం బారినపడగా.. మొదటి భార్య వాణి.. ఆస్తి పంపకం విషయంలో ఫోన్‌లో తరచుగా గొడవసాగేది. తీవ్ర మనస్తాపానికి గురైన సురేశ్ బుధవారం తన మామిడితోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై శంకర్ పంచనామ నిర్వహించి శవాన్ని పరిగి ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయంత్రం ఇద్దరి భార్యల సమక్షంలో సురేశ్ అంత్యక్రియలు జరిగాయి.

ఆటో, బైక్ ఢీ..

కూలీలకు స్వల్ప గాయాలు

బొంరాస్‌పేట: పరిగి, బొంరాస్‌పేట మండలాల శివారులో జాతీయ రహదారిపై ఆటో, బైక్ ఢీ కొన్నాయి. వివరాలు.. పరిగి మండలం బ్రాహ్మణపల్లితండాకు చెందిన కూలీలు మండల పరిధిలోని బుధవారం భోజన్నగడ్డతండాకు కలుపుతీతకు వచ్చి సాయంత్రం ఆటోలో తిరిగివెళ్తున్నారు. కర్ణాటక ప్రాంతం సేడంకు మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఎదరుగా వాహనాలు రావడంతో తడబడి ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాలు పూర్తిగా దెబ్బతినగా ఆటోలో ఉన్న కూలీలకు స్వల్పగాయాలయ్యాయి.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఇటీవల ప్రారంభించిన జిల్లా కేంద్ర గ్రంథాలయం తన ఛాంబర్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు.

కదులుతున్న రైలు దిగి..

- మహిళ దుర్మరణం

బషీరాబాద్: వేగంగా కదులుతున్న రైలు నుంచి దిగడానికి యత్నించిన మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని మంతట్టి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిఘణాపూర్ గ్రామానికి చెందిన చెరుకు నాగమ్మ(42) హైదరాబాద్ నుంచి రెడ్డి ఘనపూర్ వెళ్లేందుకు ప్యాసింజర్ రైలుకు బదులుగా పొరపాటున సోలాపూర్ ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. అయితే మంతట్టి స్టేషన్ వచ్చినా రైలు ఆగకపోవడంతో కంగారులో వేగంగా కదుతున్న రైలులోనుంచి దూకింది. దీంతో రైలు పట్టాలకు ఆమె తల బలంగా తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

భర్తతో గొడవపడి..

ఇంటినుంచి వెళ్లిపోయిన భార్య

చేవెళ్ల: ఇంట్లో గొడవపడిన భార్య చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదని భర్త రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన రాజు అదే గ్రామానికి చెందిన శిరీషను ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఏడాది కాలంగా కలిసి ఉంటున్నారు. బుధవారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఇంట్లో చెప్పకుండా శిరీష బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా ఎక్కడా ఆచూకి లభించలేదు. దీంతో భర్త రాజు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెట్టును ఢీకొట్టిన బైక్

- యువకుడి దుర్మరణం

మహేశ్వరం: బైక్‌పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మహేశ్వరం గేటు సమీపంలో చోటు చేసుకుంది. సీఐ ముని తెలిపిన వివరాలు... మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (23) వృత్తిరీత్యా కారు డ్రైవర్. బుధవారం మహేశ్వరం నుంచి తుక్కుగూడ వైపు బైక్‌పై వెళ్తుండగా మహేశ్వరం గేటు దాటగానే ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రవీందర్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

అనంతగిరి: విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ పేరిట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. మన ఊరు మనబడికి సరిపడా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేంద్ర బహదూర్, రాష్ట్ర బాధ్యులు లక్ష్మీకాంతరావు, కమల్ రెడ్డి, జాకా వెంకటేశం, ఆనందం, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన లారీ

ఒకరి దుర్మరణం.. ఇద్దరికి గాయాలు


లాలప్ప (ఫైల్)

తాండూరు టౌన్: లారీని దొంగతనం చేయడంతో పాటు, బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాలు.. యాలాల మండలం హాజీపూర్‌కు చెందిన కృష్ణ హైదరాబాద్‌లో గురుకుల పాఠశాల పరీక్ష ఉండటంతో బుధవారం తెల్లవారుజామున నరేష్, లాలప్పతో కలిసి బైకుపై తాండూరు రైల్వే స్టేషన్‌కు వస్తున్నాడు. పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి రాగానే ఓ లారీ వెనుక నుంచి వచ్చి బైకును ఢీకొట్టింది. దీంతో లాలప్ప (28) తలకు బలమైన దెబ్బ తగలగా అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణతో పాటు నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ఇద్దరినీ తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో లారీని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. కాగా కరన్‌కోటకు చెందిన ఓ వ్యక్తి ఇట్టి లారీని మంగళవారం రాత్రి దొంగతనం చేసి పట్టణంలో చక్కర్లు కొట్టినట్లు సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.


చెన్నారెడ్డిగూడ-బోడకొండ గుట్టల మధ్య జలపాతం, (ఇన్‌సెట్‌లో) పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జలపాతం.. జాగ్రత్త గురూ..

మంచాల మండలంలోని చెన్నారెడ్డి గూడ–బోడ కొండ గుట్టల మధ్య నుంచి జాలువారుతున్న జలపాతం వద్ద పర్యటకుల తాకిడి ఎక్కువవుతోంది. ఇక్కడ పూర్తిగా బండరాళ్ల మధ్య గుట్టల నుంచి వచ్చే వర్షపు నీరు జాలుపారుతోంది. చూడడానికి ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ ఇక్కడ గతంలో జాలు కింద ఉండే చెక్‌డ్యాంలో పడి ఒకరు మృత్యువాతపడ్డారు. పోలీసులు కూడా ఇక్కడకు రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతం వద్దకు రావద్దంటూ ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు. అయినా స్థానికులు ఇక్కడకు వస్తున్నారు. చుట్టూ గుట్టల ప్రాంతం కావడంతో నగరం శివారు ప్రజలు ఇక్కడకి వచ్చి ప్రకృతి, జలపాతం అందాలను తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యాటకులు ఇటువైపు రాకుండా అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– మంచాల


గుట్టల మధ్య చెక్‌డ్యాం